
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 63 వ భాగం

### దక్ష ప్రజాపతి – 12

### శివానుగ్రహం

క్రితం వ్యాసంలో బ్రహ్మాది దేవతలు దక్షుణ్ణి కరుణించమని అడగడానికి శివుడి దగ్గిరకి వెళ్ళారనీ, ఆది మధ్యాంతరాత్మ అయిన పరమేశ్వరుణ్ణి కీర్తిస్తూ బ్రహ్మ ఆయన్ని మనసులో తెలుసుకున్నాడని చెప్పాడనీ చదివాం. యజ్ఞం సంగతి ఇప్పుడింత వరకూ వచ్చింది కనక, బ్రహ్మ చెప్తున్నాడు.

సీ. అనఘ! లోకంబుల యందు వర్ణాశ్రమ;
సేతువు లనఁగఁ బ్రఖ్యాతి నొంది
బలసి మహాజన పరిగృహీతంబులై;
యఖిల ధర్మార్థదాయకము లైన
వేదంబులను మఱి వృద్ధి నొందించుట;
కొఱకునై నీవ దక్షుని నిమిత్త
మాత్రునిఁ జేసి యమ్మఖముఁ గావించితి;
వటుగాన శుభమూర్తివైన నీవు [4-147]

తే. గడఁగి జనముల మంగళకర్మ లయిన
వారి ముక్తి, నమంగళాచారు లయిన
వారి నరకంబు, నొందింతు భూరిమహిమ
భక్తజనపోష! రాజితఫణివిభూష! [4-147.1]

లోకంలో వర్ణాశ్రమాలు అనేవి నిర్ణయించేది వేదాలు. బుధజనులైనవారు గౌరవించేవి. ఆ ధర్మార్థదాయకాలైన వేదాలు వృద్ధి చెందడానికి నువ్వే దక్షుడిచేత – అతన్ని నిమిత్తమాత్రుడిగా చేసి (మరోసారి భగవద్గీత చెప్పినట్టూ అహమాత్మా గుడాకేశ..) – యజ్ఞం చేయించావు. ప్రాణులకి వారివారి కర్మలని బట్టి శుభాశుభాలు అనుగ్రహిస్తున్నావు.

వ. అట్లగుటం దత్కర్మంబు లొకానొకనికి విపర్యాసంబు నొందుటకుఁ గారణం బెయ్యదియో? భవదీయ రోషంబు హేతువని తలంచితినేనిఁ ద్వదీయ పాదారవింద నిహిత చిత్తులై సమస్తభూతంబుల యందు నినుం గనుంగొనుచు భూతంబుల నాత్మయందు వేఱుగాఁ జూడక వర్తించు మహాత్ముల యందు నజ్ఞులైనవారి యందుఁబోలె రోషంబు దఱచు వొరయ దఁట; నీకుఁ గ్రోధంబు గలదే?" యని.

[4-148]

ఇంతటివాడి నువ్వు. అయితే కర్మలు ఒకరి విషయంలో శుభాలనిస్తుంటే మరొకరికి కష్టాలు కలగడానికి కారణం ఏమై ఉండొచ్చు? వీటికి నీ కోపం కారణం అనుకుంటే, అన్ని వేళల్లోనూ అందరిలోనూ నిన్నేఆత్మగా చూసి, వేరు అనేది లేదనుకుంటారో అటువంటి మహాత్ములకి మామూలు జనానికి వచ్చినట్టూ కోపం రావకపోవడం చూస్తున్నాం. అటువంటి మహాత్ముడవైన నీకు క్రోధం ఎక్కడిది? ఇదే మనం ముందునుంచీ చెప్పుకుంటున్నది – దక్షుడి కోపం ఆయన్నే కాటేసింది కానీ దీనికి శివుడు (కానీ, శివుడి కోపం కానీ) కారకుడు కాదు.

సీ. మఱి భేదబుద్ధిఁ గర్మప్రవర్తనముల;
మదయుతు లయి దుష్టహృదయు లగుచుఁ
బరవిభవాసహ్య భవ మనో వ్యాధులఁ;
దగిలి మర్మాత్మ భేదకము లయిన
బహు దురుక్తుల చేతఁ బరులఁ బీడించుచు;
నుండు మూఢులను దైవోపహతులఁ
గాఁ దలపోసి య కృపటచిత్తులకు నీ;
వంటి సత్పురుషుఁ దేవలన నైన [4-149]

తే. హింసఁ గావింపకుండు సమిద్ధచరిత!
నీలలోహిత! మహితగుణాలవాల!
లోకపాలనకలిత! గంగాకలాప!
హర! జగన్నుతచారిత్ర! యదియుఁ గాక. [4-149.1]

మరి మూర్ఖులు ఎలాంటివారు? ఇతరుల వైభవాన్ని అసహ్యగించుకుంటూ మనోవ్యాధితో (పరవిభవఆసహ్య భవ మనోవ్యాధుల) కుంగుతూ ఉంటారు. దానితో ఇతరులని పీడిస్తూ ఉంటారు. అటువంటి కపట చిత్తం కలవారికి నీవంటి సత్పురుషుడు హింస కావిస్తాడా? అంటే ఇవన్నీ దక్షుడు నీకు తెలిసో తెలియకో చేసాడు, కానీ నువ్వు అతన్ని ఇప్పటివరకూ హింసించలేదు అని నర్మ గర్భంగా చెప్తున్నాడన్నమాట.

ఈ పద్యం ఎత్తుగీతిలో దాదాపు అన్ని పాదాలలోనూ మరోసారి పోతనలో శివభక్తుడు కనిపించాడా? ఇక్కడ శివుడు సమిద్ధ చరితుడు (మంచి ప్రసిద్ధ మైన చరిత్ర కలవాడు), నీలలోహితుడు (నీలవర్ణం కలిగినవాడు), మహితగుణాలవాలుడు, లోకపాలనకలితుడు (లోకాలని పాలించేవాడు), గంగాకలాపుడు, హరుడు (లయ కారుడు), జగన్నుత చరిత్రుడు.

సీ. అమర సమస్త దేశము లందు నఖిల కా;
లములందుఁ దలఁప దుర్లంఘ్య మహిముఁ

డగు పద్మనాభు మాయా మోహితాత్మకు;
లై భేదదర్శను లైనవారి
వలనను ద్రోహంబు గలిగిన నైనను;
నది దైవకృత మని యన్యదుఃఖ
ముల కోర్వలేక సత్పురుషుండు దయచేయు;
గాని హింసింపఁడు గాన నీవు [4-150]

తే. నచ్యుతుని మాయమోహము నందకుంటఁ
జేసి సర్వజ్ఞుఁడవు; మాయచేత మోహి
తాత్ములై కర్మవర్తను లయినవారి
వలన ద్రోహంబుగలిగిన వలయుఁ బ్రోవ. [4-150.1]

అవి అలా ఉంచితే, ఈ విశ్వంలో విష్ణుమాయ అనేది అర్థం కావడం దుర్లభం. అది అర్థం చేసుకోలేనివారు భేద దృష్టితో ప్రవర్తిస్తూ ఉంటారు. వారి వల్ల ద్రోహం జరిగితే సత్పురుషులు ఎవరినీ హింసించకుండా ఇదంతా విష్ణుమాయ అని ఊరుకుంటాడు. మరి విష్ణుమాయకి అతీతుడవైన నువ్వు సర్వజ్ఞుడవి. అందువల్ల ఈ మాయవల్ల ఎవరైనా కీడు చేస్తే వాళ్ళని క్షమించి కాపాడాలి కదా?

వ. అది గావున యజ్ఞభాగార్హుండవయిన నీకు సవనభాగంబు సమర్పింపని కతన నీచేత విధ్వంస్తంబయి పరిసమాప్తి నొందని దక్షాధ్వరంబు మరలనుద్ధరించి దక్షునిఁబునర్జీవితుం జేయుము; భగుని నేత్రంబులును, భృగుముని శ్మశ్రువులును, బూషుని దంతంబులును, గృపఁజేయుము; భగ్నాంగులయిన దేవఋత్విజ్నికాయంబులకు నారోగ్యంబు గావింపుము; ఈ మఖావశిష్టంబు యజ్ఞపరిపూర్తి హేతుభూతంబయిన భవదీయ భాగంబగుం గాక.

[4-151]

నీకు యజ్ఞభాగం లేకుండా దక్షుడు చేసిన యజ్ఞం పూర్తి కాలేదు, అందువల్ల దక్షుణ్ణి బతికించి యజ్ఞం పూర్తి అయేలా చూడాలి. ఆ యజ్ఞం పూర్తి కావడం కోసం భగుడికి కళ్ళు, భృగు మహర్షికి మీసాలు, పూషుడికి దంతాలు మళ్ళీ రావాలి. శరీరం తూట్లు పడేలాగా కొట్టాక అంగాలాన్నీ పాడైన దేవ, ముని గణాలకి పూర్తి ఆరోగ్యం ప్రసాదించు. ఈ యజ్ఞం పూర్తి అయ్యాక నీ భాగం సంతోషంగా స్వీకరించు.

చ. అని చతురాననుండు వినయంబున వేఁడిన నిందుమౌళి స
య్యనఁ బరితుష్టిఁ బొంది దరహాసము మోమునఁ దొంగలింప ని
ట్లను హరిమాయచేత ననయంబును బామరు లైనవారు చే
సిన యపరాధ దోషములు చిత్తములో గణియింప నెన్నఁడున్. [4-152]

బ్రహ్మ ఇలా అనేసరికి, శివుడు (ఇందుమౌళి) నవ్వు మొహంతో బ్రహ్మాది దేవతలతో చెప్తున్నాడు, హరిమాయ చేత పామరులు ఎవరేనా నన్ను ఏ మాట అన్నా మనసులో ఉంచుకోను.

క. బలియుర దండించుట దు
ర్బలజన రక్షణము ధర్మపద్ధతి యగుటం
గలుషాత్ముల నపరాధము
కొలఁదిని దండించుచుందుఁ గొనకొని యేనున్. [4-154]

అయితే, బలవంతులని శిక్షించడం, దుర్బలులని రక్షించడం అనేది ధర్మం కదా? అలా దుష్టులు చేసిన పాపాలకి వాళ్ళు దండించబడుతూ ఉంటారు. దండనం గురించి ఇంత చెప్పాక మరి ఈ యజ్ఞం పూర్తికావడానికీ, మిగతా దేవతలకి శుభం జరగడానికీ ఏమౌతుంతో చెపుతున్నాడు

వ. అని "దగ్ధశీర్షుం డయిన దక్షుం డజముఖుం డగు; భగుండు బర్హి స్సంబంధ భాగంబులు గలిగి మిత్రనామధేయ చక్షుస్సునం బొడగాంచు; పూషుండు పిష్టభుక్కగుచు యజమాన దంతంబులచే భక్షించు; దేవతలు యజ్ఞావశిష్టంబు నాకొసగుటంజేసి సర్వావయవ పూర్ణులై వర్తింతురు; ఖండితాంగులైన ఋత్విగాది జనంబు లశ్వనీదేవతల బాహువులచేతను బూషుని హస్తంబులచేతను లబ్దబాహు హస్తులై జీవింతురు; భృగువు బస్తశ్మశ్రువులు గలిగి వర్తించు;" అని శివుండా నతిచ్చిన సమస్తభూతంబులును సంతుష్టాంతరంగంబులై "తండ్రీ లెస్సయ్యె" నని సాధువాదంబుల నభినందించిరి: అంతనా శంభుని యామంత్రణంబు వడసి సునాసీర ప్రముఖులగు దేవతలు ఋషులతోడం గూడి రా నజుండును రుద్రునిం బురస్కరించుకొని దక్షాధ్వర వాటంబుకుం జనియె; అంత. [4-155]

తల యజ్ఞ గుండంలో పడి దగ్ధం అయిపోయింది కనక (మొదట్లో నంది పెట్టిన శాపాన్ని అనుసరించి), దక్షుడుకి మేక (అజ) మొహం వస్తుంది. భగుడు దర్భలతో (బర్హి) సంబంధించిన యజ్ఞభాగాన్ని పొందుతూ మిత్ర నామకమైన నేత్రాలతో చూస్తాడు. పూషుడు పిండములని (పిష్ట భుక్) యజమాని దంతాల ద్వారా భుజిస్తాడు. యజ్ఞశేషాన్ని నాకు సమర్పించడం వల్ల దేవతలకి అన్ని అవయవాలు కలుగుతాయి. అవయవాలు పోయిన ఋత్విక్కులు అశ్వినీ దేవతల బాహువులతో, పూషుని హస్తాలతో వారి బాహువులనీ, హస్తాలనీ పొంది బ్రతుకుతారు. భృగువు చీంబోతు మీసాలు, గెడ్డము పొందుతాడు అని శివుడు ఆజ్ఞ ఇచ్చాడు. అప్పుడు ఇంద్రుడు మొదలైన దేవతలు, ఋషులతో కలిసి బ్రహ్మదేవుడు శివుణ్ణి ముందుంచుకొని దక్షయజ్ఞం జరిగిన ప్రదేశానికి వెళ్ళాడు.

క. శర్వుని యోగక్రమమున
సర్వావయవములుఁ గలిగి సన్ముని ఋత్వి
గ్గీర్వాణముఖ్యు లొప్పిరి
పూర్వతనుశ్రీల నార్యభూషణ! యంతన్. [4-156]

ఈ పద్యంలో మళ్ళీ విదురుడితో మైత్రేయుడు చెప్తున్నాడు – అలా శివాజ్ఞ వల్ల ఋత్విక్కులూ, దేవతలూ (ఋత్విగ్గీర్వాణముఖులు) పూర్వం ఉన్న దేహాలతో మళ్ళీ బతికారు.

క. విను దక్షు నంత మేషము
ఖునిఁ జేసిన నిద్ర మేలుకొని లేచిన పో
ల్కిని నిలిచె దక్షుఁ, డభవుఁడు
కనుఁగొనుచుండంగ నాత్మఁ గౌతుక మొప్పన్. [4-157]

తన శరీరానికి మేక మొహం తగిలించేసరికి, నిద్రలోంచి లేచినట్టూ లేచాడు దక్షుడు. అదీ పరమేశ్వరుడు చూస్తూండగానే. దీనర్థం ఏమిటంటే, ఓ సారి అహంకారం పోగానే ఎదురుగా సంతోషంతో నవ్వుతున్న – తన గురువు లాగా – మహేశ్వరుడు కనిపించాడు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS